సాక్షి
మెదక్
గురువారం : 2 : ఫిబ్రవరి : 2023

లినెన్.. మది దోచెన్ 18లో



లినెన్ బట్టల వాడకం పెరుగుతోంది. చేనేతను ప్రోత్సహించేందుకు ఇటీవల జాతీయస్థాయిలో నిర్వహించిన విరాసత్ ప్రదర్శనలో దుబ్బాక చీరకు గుర్తింపు వచ్చింది.



మేలైన పద్ధతులతో అధిక దిగుబడి

పొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్త శ్వేత అన్నారు. 18లో



మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు

నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో పర్యటించారు. 19లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజర్షిషా



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్‌కలెక్టరేట్: జిల్లా నూతన కలెక్టర్‌గా రాజర్షిషా పదవీ బాధ్యతలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆర్డీఓ సాయిరాం, డీపీఓ సాయిబాబా, సీపీఓ కాసిం, జిల్లా వైద్యాధికారి చందూనాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి విజయశేఖర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి కృష్ణమూర్తి, డీఎస్ఓ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి ఆశకుమారి, డీఎస్‌డీఓ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, మెప్మా పీడీ ఇందిర, బీసీ సంక్షేమ అధికారి కేశురాం, డీపీఆర్ఓ శాంతికుమార్, తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంజేపీ బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ (రీజినల్ కోఆర్డినేటర్) ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని తునికి గురుకుల పాఠశాలలో బీసీ గురుకులాల ఉపాధ్యాయులకు పదో తరగతి ప్రశ్నాపత్రంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పదో తరగతి ప్రశ్నాపత్రంలో మార్పులు చేసిందన్నారు. కొత్తగా వచ్చే మార్పులపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబాజీపేట వార్డు సభ్యుల రాజీనామా



రాజీనామా పత్రాలను అందజేస్తున్న వార్డు సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట పంచాయతీ వార్డు సభ్యులు ఆరుగురు బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. వార్డు సభ్యులు శ్యామల, అసియాబేగం, రాణి, లక్ష్మణ్, యాదగిరి, మల్లేశంగౌడ్ రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. సర్పంచ్ సాన సాయిలు జీపీ నిధులు దుర్వినియోగం చేయడంతో పాటు అతడి కుమారుడు, మనవడు విధుల్లో జోక్యం చేసుకుంటూ ఇష్టారాజ్యంగా నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈవిషయమై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతోనే రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఉపసర్పంచ్ సుంకరి మమత డీపీఓను కలిసి రాజీనామ పత్రం అందజేశారు.

విద్యా రంగానికి నిధులు కేటాయించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

నర్సాపూర్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు కాలేజీలకు చెందిన విద్యార్థులతో బుధవారం ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్, శ్రీకాంత్, నాయకులు ఆకాశ్, లక్ష్మీప్రసాద్, మహేశ్, శ్రీకాంత్, సిద్ధు, ప్రకాశ్ పాల్గొన్నారు.

పోడు రైతు.. గోడు తీరే!

- త్వరలో పట్టాల అందజేత
- జిల్లాలో 182 మంది రైతులు అర్హులు
- ఇటీవల మంత్రి సత్యవతి రాథోడ్ వీడియో కాన్ఫరెన్స్
- వివరాలు తెలిపిన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



గాజిరెడ్డిపల్లి శివారులో సాగు చేసిన పోడు భూమి

మెదక్‌జోన్: పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. అర్హులైన రైతులకు త్వరలోనే పట్టాలు ఇవ్వనున్నట్లు ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించారు. భూమి హక్కు కోసం 4,015 మంది దరఖాస్తు చేసుకోగా అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులో 182 మంది మాత్రమే అర్హులని తేల్చారు. దీంతో మిగిలిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాలో మొత్తం 21 మండలాలు ఉండగా 18 మండలాల పరిధిలో అడవులు విస్తరించి ఉన్నాయి.
- వీటిలో 15 మండలాల పరిధిలోని అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటూ వేలాది మంది గిరిజనులు, గిరిజనేతరులు జీవనం సాగిస్తున్నారు.
- పోడు భూములు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న వారికి పట్టాలు ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులు గతేడాది దరఖాస్తు చేసుకున్నారు.
- మొత్తం 4,015 మంది లబ్ధిదారులు సుమారు 6 వేల పైచిలుకు ఎకరాలకు దరఖాస్తు చేసుకున్నారు.
- వారిలో అర్హుల లెక్క తేల్చేందుకు సంబంధిత ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రజల సమక్షంలో నాలుగు నెలల క్రితం సమావేశాలు నిర్వహించారు.
- సర్వే, సమావేశాల అనంతరం దరఖాస్తు చేసుకున్న వారిలో 182 మంది మాత్రమే అర్హులని, వారికి ఐదు వందల పైచిలుకు ఎకరాలంటూ తేల్చారు.
- ఈ లెక్కన కేవలం 4.8 శాతం మంది అర్హులు కానున్నారు. ఈవిషయమై అధికారులను ఆరా తీస్తే సరైన సమాధానం చెప్పడం లేదు.
- కానీ ఈనెల 30వ తేదీన మంత్రి సత్యవతి రాథోడ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో 182 మంది అర్హులంటూ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు.
- అదే సంఖ్య ఫైనల్ అవుతుందా..? లేదా మరేమైనా మార్పులు, చేర్పులు ఉంటాయా అనే విషయం తేలాల్సి ఉంది.

18 ఏళ్లపై బడి ఉంటేనే..

- పోడు పట్టాలు చేసి ఇవ్వాలంటే 2005 సంవత్సరానికి ముందు నుంచి దరఖాస్తులో ఉంటేనే అర్హులని అధికారులు చెబుతున్నారు. అంటే 18 ఏళ్ల పైబడి సాగు చేసుకోవాలన్న మాట.
- గిరిజనేతరులు దేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి అనగా 75 ఏళ్ల పైబడి నుంచి దరఖాస్తులో ఉంటే అర్హులు అవుతారని చెబుతున్నారు. ఈ లెక్కన 1948 నుంచి గిరిజనేతరులు దరఖాస్తులో ఉండాలి.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేవలం 182 మంది లబ్ధిదారులకు గానూ ఐదు వందల ఎకరాలకు మాత్రమే అర్హులంటూ అధికారులు ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది.
- ఈ విషయంపై ఓ అధికారి మాట్లాడుతూ.. జిల్లాలో పోడు భూములకు 4,015 మంది దరఖాస్తు చేసుకోగా 182 మంది అర్హులని తేల్చిన విషయం వాస్తవమేనని చెప్పుకొచ్చారు.

నాకు పోడు భూమే దిక్కు



సారూ నేను చాలా కాలంగా మా గ్రామ శివారులో 3.20 గుంటల పోడు భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాను. నాకు ఇద్దరు కొడుకులు. ఆ భూమి మాత్రమే నాకు జీవనాధారం.

– కాయితీ వెంకయ్య, గాజిరెడ్డిపల్లి

'ఫ్లాగ్ షిప్' అమలుకు కృషి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

కలెక్టర్ రాజర్షిషా

మెదక్‌జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్ షిప్ కార్యక్రమానికి అధికారులు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాలను శాఖల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు లబ్ధిదారులకు న్యాయం జరిగేలా జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈనెల 5లోగా పోడు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ముద్రితం కావాలన్నారు. నెలాఖారులో నూతన కలెక్టరేట్ నిర్మాణంలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హులకు దళితబంధు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. మత్స్య అభివృద్ధి పథకం కింద కొత్తగా గుర్తించిన 148 చెరువులకు గానూ 47 నూతన సంఘాలు ఏర్పాటు చేసి ఎక్కువ మందికి సభ్యత్వం కల్పించాలన్నారు. టీఎస్ఐపాస్ కింద పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. డబుల్ బెడ్రూం నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. వనదుర్గ ఆనకట్ట ఎత్తు పెంపు, రామాయంపేట కెనాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

మెదక్ కలెక్టరేట్: హరితహారం కింద చేపట్టిన నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కల పెంపకం చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు వాడి మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. పచ్చదనం పరిఢవిల్లేలా ఎండిపోయిన మొక్కలస్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. మండల అధికారులు గ్రామస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. బృహత్ పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలకు స్థలాలను గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు సమర్ధవంతగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

'మనబడి'తో మౌలిక వసతులు

- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, డీఈఓ రమేశ్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): 'మన ఊరు– మనబడి' నిధులతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దామని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో రూ. 25 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వసతులు కల్పించిన తర్వాత పాఠశాల తీరే మారిందన్నారు. విద్యార్థులకు ఫర్నీచర్, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు ఏర్పాటు చేశామన్నారు. నిధుల కొరతలేదని.. మన బడి కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో డీఈఓ రమేశ్‌కుమార్, పీఆర్‌ఈఈ సత్యనారాయణ, జెడ్పీటీసీ పట్లోరి మాధవిరాజు, సర్పంచ్ మీనా రవీందర్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ యాదగిరి, హెచ్ఎం ప్రణీద్‌కుమార్, నార్సింగి వైస్ ఎంపీపీ సుజాత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై రూ. 50వేలు ఖర్చు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యా వ్యవస్థను బాగు చేయాలనే ప్రభుత్వం ఒక విద్యార్థిపై సంవత్సరానికి రూ. 50 వేల ఖర్చుచేస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పిల్లుట్ల ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మన బడిలో భాగంగా రూ. 35 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దశల వారీగా అన్ని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దపులి రవి, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, ఎంఈఓ బుచ్చనాయక్, హెచ్ఎం రవీందర్, నాయకులు పాల్గొన్నారు.



నూతన పాఠశాలను ప్రారంభిస్తున్న సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

పశువులకు టీకాలు తప్పనిసరి

జిల్లా పశువైద్యాధికారి విజయ్ శేఖర్‌రెడ్డి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

మనోహరాబాద్(తూప్రాన్): పశువులకు వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి విజయ్ శేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని జీడిపల్లిలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు బ్రుసెల్లోసిస్ వ్యాధి రాకుండా ఉచిత టీకాల కార్యక్రమాన్ని అడిషనల్ పశువైద్య సంచాలక అధికారి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పశువులకు గాలికుంటు, ఇతర వ్యాధులు సంక్రమించకుండా టీకాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే పశువుల దొడ్డిలో దోమల బెడద లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో తూప్రాన్ ఉమ్మడి మండల పశువైద్యురాలు లక్ష్మి, జేవీఓ రాజారాం, సిబ్బంది రెహమాన్, చిరంజీవి, నిస్సార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న శతజయంతి ఉత్సవాలు



దత్తయజ్ఞం నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రం బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో దత్తగిరి మహారాజ్ శతజయంతి ఉత్సవాలు ఆశ్రమ భావి పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా గురువారం అతిరుద్రం, దత్తయజ్ఞం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సమయాల్లో విశ్వమానవ ధర్మ ప్రచారంలో భాగంగా భజనలు, సంకీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆశ్రమ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయమాత, భావి పీఠాధిపతి డా.సిద్ధేశ్వర్‌స్వామి, అర్చకుడు, వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి కోత

- రైతు రుణాల పెంపు నబబే
- బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



మెదక్‌జోన్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2023–24 బడ్జెట్‌ను బుధవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించనప్పటికీ పరోక్షంగా కొంత ఆమోదయోగ్యమైన బడ్జెట్‌గా పలువురు అభిప్రాయపడుతున్నారు.

- ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిధుల కేటాయింపుల్లో 20 శాతం కోత విధించడంపై సర్వత్రా వ్యతిరేకత వినిపిస్తోంది.
- వలసల నివారణకు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గించడం సరికాదని కూలీలు ఆవేదన చెందుతున్నారు.
- జిల్లాలో చెప్పుకోదగ్గ నీటి ప్రాజెక్టులు లేనందున వేసవిలో వ్యవసాయ పనులు ఉండవు. ఫలితంగా ప్రజలు ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.
- జిల్లాలో 469 గ్రామ పంచాయితీలు ఉండగా 3.80 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరికి 1.75 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి.
- కాగా ఉమ్మడి జిల్లాతో పోల్చుకుంటే మెదక్ జిల్లాలో ఉపాధి పనులు అత్యధికంగా జరుగుతాయని అధికారిక లెక్కలు చెబుతున్నారు.

వేతన జీవులకు ఊరట

- జిల్లాలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు మొత్తం సుమారు 6,500 మంది ఉన్నారు. కాగా ఆదాయ పన్ను పరిమితిని రూ. 7 లక్షలకు పెంచారు.
- ఉద్యోగుల స్లాబులను 6 నుంచి 5కు తగ్గించడం .. కొత్త పన్ను విధానంలో మార్పులు తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- రానున్న ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు 11 శాతం పెంచడం రైతులకు శుభతరుణమనే చెప్పాలి.
- జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 3.95 లక్షల ఎకరాల సాగు భూములు ఉండగా.. రైతులు 2,07,892 మంది ఉన్నారు.
- ఈ యాసంగి రూ.182 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- కాగా కేంద్రం బడ్జెట్‌లో రైతులకు రుణాలు పెంచడంతో ఈ రుణం మరింత పెరగనుంది. ఇది అన్నదాతలకు ఊరటనే చెప్పాలి.
- చిరుధాన్యాల సాగుపై బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించగా, జిల్లావ్యాప్తంగా 5,265 ఎకరాల్లో సాగు చేశారు.
- ఇందులో ప్రధానంగా పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాల్లో ఈ సాగు ఎక్కువగా ఉంది. దీంతో ఆయా మండలాల్లో సాగు చేసిన రైతులకు ప్రోత్సాహం లభించనుంది.

ఆదాయ పన్ను పరిమితి పెంపు హర్షం



బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితి పెంచడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు కొంత మేర ఊరట కల్గించిన అంశం. అలాగే ఉద్యోగుల స్లాబ్‌లను 6 నుంచి 5కు తగ్గించడం కొత్త పన్ను విధానంలో మార్పు తీసుకొని రావడం సంతోషంగా ఉంది.

– మల్లారెడ్డి, ఉపాధ్యాయుడు, కూచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల

అంకెల గారడి



బడ్జెట్ కేవలం అంకెల గారడిని తలపిస్తోంది. గతంలో యూరియాపై రూ. 1.54 లక్షల కోట్ల సబ్సిడీ ఉండగా.. ఈ బడ్జెట్‌లో రూ. 1.31 లక్షలకు తగ్గించారు. అలాగే వ్యవసాయానికి బడ్జెట్‌లో కోత విధించడంతో పాటు ఉపాధి నిధులు తగ్గించడం సరికాదు.

– మ్యాదం బాలకృష్ణ, టీపీసీసీ నేత

అన్ని వర్గాలకు ఆమోదం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల అభివృద్ధిని సూచిస్తోంది. మహిళా సాధికారత, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, రైతు రుణాలకు పెద్దపీట వేయడం హర్షనీయం.

– గద్దం శ్రీనివాస్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు

బడా వ్యాపారులకే మేలు



బడ్జెట్‌లో వేతన జీవులకు మరోసారి నిరాశ ఎదురైంది. తొమ్మిదేళ్లుగా పన్ను మినహాయింపు విషయమై ఉద్యోగవర్గాలను మోసం చేస్తున్నారు. మధ్య తరగతి ఉద్యోగ వర్గాలకు ఊరటనిచ్చే విధంగా ఆదాయపు పన్ను స్టాండర్డ్ డిడక్షన్ పెంచకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. బడా వ్యాపారులకు లబ్ధిచేకూరే విధంగా బడ్జెట్ ఉంది.

– ప్రణీద్‌కుమార్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

లినెన్.. మది దోచెన్

విరాసత్ జాతీయ ప్రదర్శనలో దుబ్బాక చీర

తాటి జాన్‌రెడ్డి, సిద్దిపేట డెస్క్...


దుబ్బాకలో సినీ నటి సమంత (ఫైల్)

'చుట్టూ చెంగావి చీర కట్టావే చిలకమ్మా.. ఆశపడే కన్నులలో ఊసులాడే వెన్నెల బొమ్మా..' అంటూ చీరకట్టులోని కనికట్టును వర్ణించాడు ఓ సినీకవి. భారతీయ సంప్రదాయానికి తొలిమెట్టుగా.. మన సంస్కృతికి జీవనాడిగా.. ప్రపంచం చేతులెత్తి నమస్కరించే అరుదైన గొప్పతనం చీరకట్టుకే ఉందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. దేశంలో భాషలెన్ని ఉన్నా.. వేషధారణలో చీరకట్టు ఒక్కటే మన సంస్కృతి ఐక్యతకు చిహ్నం. చేనేత చీర.. భారతీయ సాంస్కృతిక వారసత్వానికి చిరునామాగా మారింది. ఫ్యాషన్ ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతున్నా.. అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటూనే చేనేత చీర సజీవంగా నిలబడింది. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో నేసిన చీరకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

మనదేశంలో కంటే విదేశాల్లోనే లినెన్ ఉత్పత్తుల వాడకం ఎక్కువగా ఉంది. అయితే ఇండియాలో చాలాచోట్ల లినెన్‌లో విస్కో, కాటన్ మిక్స్, రెమీ యారన్, పాలిస్టర్ మిక్స్, యార్గల్ మిక్స్ ఎక్కువగా ఉంటోంది. ఇదంతా చైనా నుంచే దిగుమతి అవుతోంది. క్వాలిటీ లినెన్ ఇటలీ, యూకే, ఫ్రాన్స్, బెల్జియం నుంచి ఇండియాకు వస్తోంది.

విరాసత్ ప్రదర్శనకు ఇలా...

చీరల పండగ పేరిట ఢిల్లీలో జరిగిన మొదటి విరాసత్ ప్రదర్శన విషయం శ్రీనివాస్‌కు తెలిసింది. దీంతో వీవర్స్ సర్వీస్ సెంటర్ నార్త్‌జోన్ ఇన్‌చార్జ్ నౌటియాల్‌కు ఫోన్ చేశాడు. ఆయన హైదరాబాద్‌లో పనిచేసిన సమయంలో శ్రీనివాస్‌కు పాత పరిచయం ఉంది. తాను తయారు చేస్తున్న లినెన్ చీరలు, వాటి నాణ్యత గురించి నౌటియాల్‌కు చెప్పారు. దీంతో రెండో విరాసత్ ప్రదర్శనలో శ్రీనివాస్ లినెన్ చీరకు అవకాశం లభించింది.

సమంత స్ఫూర్తితో...

తెలంగాణ చేనేత బ్రాండ్ అంబాసిడర్ హోదాలో సినీనటి సమంత 2017లో దుబ్బాకకు వచ్చారు. పట్టణంలోని చేనేత కార్మికులను కలిశారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. దుబ్బాక హ్యాండ్లూమ్స్ వీవర్స్ సొసైటీ చైర్మన్ బోడ శ్రీనివాస్ ఆమె వెంట ఉన్నారు. బాగల్‌పూర్ నుంచి తీసుకొచ్చిన చేనేత చీరను శ్రీనివాస్‌కు ఇచ్చి ఇలాంటివి ఇక్కడ తయారు చేస్తారా? అని అడిగారు. సాదారకంలో ఉన్న బాగల్‌పూర్ చీర 40 టు 44.(కాటన్ కౌంట్) చూపించారు. అప్పుడే శ్రీనివాస్‌కు సాదాతోపాటు, ఇక్కత్‌లోనూ ఇలాంటి చీరలను నేయాలనే ఆలోచన వచ్చింది. గతేడాది సొంతంగా దుబ్బాక హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ లిమిటెడ్ కంపెనీకి శ్రీకారం చుట్టారు. 80–80, 100–80 లినెన్ యారన్‌లో సన్నసాదాతో పాటు, ఇక్కత్ చీరలకు శ్రీకారం చుట్టారు. అనేక రకాల డిజైన్లలో ఈ చీరలను నేయిస్తున్నారు.




దుబ్బాక హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ బోడ శ్రీనివాస్ సారథ్యంలో టై అండ్ డై విధానంలో ఇక్కత్‌లో చీరను దుబ్బాకలోనే తయారు చేశారు. దీని తయారీకి పూర్తిగా బెల్జియం లినెన్ 80లీ ఉపయోగించారు. ఈ ప్రత్యేకత కారణంగానే విరాసత్ రెండో ప్రదర్శనకు దుబ్బాక చీర ఎంపికైంది. దేశవ్యాప్తంగా 75 చీరలకు చోటు దక్కగా, అందులో దుబ్బాక చీర ఒకటి. గ్రీన్, పింక్, లైట్‌బ్లూ, ఎల్లో, వైట్ కలర్స్ మిక్స్‌తో ఈ లినెన్‌చీరను నేశారు. ఈ చీర తయారీకి

చీర ప్రత్యేకత..

నాణ్యమైన లినెన్ యారన్ 80లీ ఫైబర్ వాడారు. బాంబే, అహ్మదాబాద్ లాంటి నగరాల్లో ఏసీ ప్లాంట్‌లలో మరమగ్గాలపై లినెన్ ఉత్పత్తులు తయారవుతాయి. అయితే మాములు మగ్గాలపై లెనిన్ ఫైబర్ కట్ కాకుండా ఉండేందుకు సైజింగ్ చేయడానికి దుబ్బాకలో క్వాలిటీ కెమికల్ లిక్విడ్స్ వాడి నైపుణ్యం సాధించారు. వీటిని సూరత్, అహ్మదాబాద్‌ల నుంచి తెప్పించారు. సైజింగ్ కోసం పెద్ద కసరత్తు జరిగింది. చేనేతలో విశేష అనుభవమున్న శ్రీనివాస్ సైజింగ్ విషయంలో మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. దీని కోసం దశాబ్దకాలం కష్టపడ్డారు. ఆ కృషి ఫలితమే ఈ చీర. ఆయా చీరల డిజైన్లను బట్టి ధర రూ.6,800 నుంచి రూ.12,000 వరకు ఉంది.

విరాసత్ అంటే...

చేనేత రంగానికి, చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం విరాసత్‌కు శ్రీకారం చుట్టింది. ప్రత్యేకించి చేనేత చీరలకు పెద్దపీట వేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది డిసెంబర్ 16వ తేదీన దేశరాజధాని ఢిల్లీలో విరాసత్ పేరిట చేనేత చీరల పండగను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించగా, డిసెంబర్ 30వ తేదీతో ముగిసింది. ఇందులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 70 చీరలు ప్రదర్శనలో ఉంచారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో చేసిన ప్రచారం ద్వారా ఈ కార్యక్రమం ఎంతో విజయవంతమైంది. చేనేతకు చేయూత ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలు ఇచ్చాయి. దీంతో 2023 జనవరి 3వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని హ్యాండ్లూమ్ హాట్‌లో రెండో దశ చీరల పండగ నిర్వహించారు. ఇందులో 75 విభిన్నమైన చేనేత చీరలను ప్రదర్శనలో ఉంచారు. రిటైల్ అమ్మకాలతో పాటు మగ్గం ప్రదర్శన, చీరలపై సమావేశాలు, సదస్సులు కూడా నిర్వహించారు. అంతేకాకుండా భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.



వడ్డీలేని రుణాలు ఇవ్వాలి



చేనేతలో ఉత్పత్తులు తయారు చేసే ప్రొడ్యూసర్ కంపెనీలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి. మేము తయారు చేసిన వాటిని టెస్కో కొనుగోలు చేయాలి. కేంద్ర ప్రభుత్వమే ప్రొడ్యూసర్ కంపెనీ రిజిస్ట్రేషన్ ఖర్చు భరించింది. తెలంగాణ వ్యాప్తంగా 26 ప్రొడ్యూసర్ కంపెనీలు ఉండగా, ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా దుబ్బాకలోనే ఉంది. ఇప్పుడిప్పుడే లినెన్ వాడకం పెరుగుతోంది. చేనేతను ప్రోత్సహించేందుకు అందరూ వీటిని ధరిస్తే బాగుంటుంది. మరిన్ని ఆర్డర్లు ఇచ్చేందుకు ఎవరైనా ముందుకొస్తే నాణ్యమైన లినెన్ చీరలు తయారు చేసి ఇస్తాం. చీరలతోపాటు లినెన్ సూటింగ్ అండ్ షర్టింగ్‌తో పాటు టవల్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

– బోడ శ్రీనివాస్

కాకతీయుల కాలం నాటి వీరగల్లు లభ్యం


పోచమ్మ ఆలయం వద్ద లభించిన వీరగల్లు

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులోని నల్లపోచమ్మ దేవాలయం వద్ద కాకతీయుల కాలం నాటి ఎక్కటి వీరగల్లు లభించినట్లు చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విగ్రహం కుడి చేతిలో బాకు, ఎడమ చేతిలో విల్లు, భుజంపై విల్లంభులు, నడుముకు వీరకాసె, కడియాలు ధరించిన రాతి విగ్రహం లభించిందని, అది కాకతీయుల కాలం నాటిదని తెలుస్తోందన్నారు. అన్ని రకాల ఆయుధాల ప్రయోగించడంతోపాటు ఒంటరిగా పోరాడే వారిని ఎక్కటి యోధులు అని పిలిచేవారని చెప్పారు. కాకతీయుల కాలంలో వీరికి ప్రత్యేక స్థానం కల్పించేవారన్నారు. ఇలాంటి అరుదైన వీరగల్లును కాపాడి చరిత్రను విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

మూకదాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ


ఆందోళన చేస్తున్న యుఎస్‌పీసీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధ్యాయుడిపై మూకదాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యుఎస్‌పీసీ నాయకులు సంగారెడ్డి డీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డిసెంబర్‌లో నిజామాబాద్ జిల్లా కోటగిరి హైస్కూల్లో పనిచేస్తున్న మల్లికార్జున్ టీచర్‌పై మూకదాడికి పాల్పడిన ఆర్ఎస్ఎస్, బజరంగదళ్ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ నేడు నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దాడులు భవిష్యత్‌లో జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

క్లుప్తంగా

నీట మునిగి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ


రమేశ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి బిజ్లిపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుక్కల రమేశ్(50) గ్రామ శివారులో ఉన్న ఫామ్‌హౌస్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికారు. గ్రామ శివారులోని వీరప్ప చెరువు కట్టపైన రమేశ్ దుస్తులు కనిపించాయి. బుధవారం ఉదయం చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అనసూజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సరైన పద్ధతులతో అధిక దిగుబడి


పొద్దుతిరుగుడులో క్షేత్ర దినోత్సవం

సిద్దిపేటరూరల్: రైతులు పొద్దుతిరుగుడు పంట సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శ్వేత అన్నారు. బుధవారం మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో 'పొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం, క్షేత్ర దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైవిధ్యీకరణలో నూనెగింజల పాత్ర, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానం గురించి వివరించారు. వరి మాగాణుల్లో నూనెగింజల పంటల ఉత్పత్తి , సాగు పద్ధతులు తెలిపారు. పొద్దుతిరుగుడులో మేలైన యాజమాన్య పద్ధతులు, ప్రస్తుత కూలీల కొరతను అధిగమించడానికి యాంత్రీకరణ ప్రాముఖ్యత, పూత దశలో బోరాక్స్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సాయినాథ్ మాట్లాడుతూ నూనెగింజల పంటలో సూక్ష్మ పోషకాలు ప్రాధాన్యత, సమగ్ర పోషక యాజమాన్యం వివరాలు తెలిపారు. శాస్త్రవేత్త ఉమారాణి పొద్దుతిరుగుడు, వివిధ నూనెగింజల పంటల విత్తనోత్పత్తి, మెలకువలపై అవగాహన కల్పించారు. రసం పీల్చే పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయోమిథక్సమ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంటలో వయ్యారి భామ కలుపు నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో బుస్సాపూర్ సర్పంచి సదాశివరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ. ప్రేమ్ సాయి పాల్గొన్నారు.

యువతి అనుమానాస్పద మృతి

ఫిర్యాదు చేసిన తండ్రి, కేసు నమోదు


సౌజన్య (ఫైల్)

దుబ్బాకరూరల్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందింది. ఈ సంఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధి చిన్న నిజాంపేట గ్రామంలో జరిగింది. ఏఎస్‌ఐ భిక్యానాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శేర్ల సౌజన్య(18) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. ఆత్మహత్యపై అనుమానం ఉన్నట్లు యువతి తండ్రి సురేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఎల్లమ్మ దేవాలయంలో చోరీ

నిజాంపేట(మెదక్): రేణుక ఎల్లమ్మ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని మండల పరిధిలోని కల్వకుంట గ్రామస్తులు తెలిపారు. దేవాలయ ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించినట్లు చెప్పారు. చోరీ విషయంపై పోలీసుల సమాచారం అందిచడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


బస్సు చక్రాల కింద వెంకటేశ్ మృతదేహం

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. జహీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి సంగారెడ్డి పట్టణానికి చెందిన వెంకటేశ్ న్యాల్‌కల్ మండలం బంగ్లా మిర్జాపూర్‌లోని తన అమ్మమ్మ ఇంటి నుంచి జహీరాబాద్‌కు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి బస్సు కింద పడటంతో మరణించాడు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ శ్రీకాంత్ చేరుకుని పంచనామ నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పడంతో కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లి హనుమాన్ ఆలయం సమీపంలో 765డి జాతీయ రహదారిపై జరిగింది. బుధవారం కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నాగారెడ్డిపేట మండలం రాఘవపల్లి గ్రామానికి చెందిన న్యాలకంటి భూమేశ్ (28) హైదరాబాద్ గండిమైసమ్మ ప్రాంతంలో కూలీ పనులు చేస్తున్నాడు. జనవరి 29వ తేదీన టీవీఎస్‌పై గండిమైసమ్మకు వచ్చాడు. తిరిగి 31న రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. నాగ్సాన్‌పల్లి హనుమాన్ ఆలయం సమీప అడవిలో వాహనం అదుపు తప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికే భూమేశ్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డబుల్ ఇళ్లు కేటాయించడం లేదని..

- గృహప్రవేశ యత్నం
- అడ్డుకొన్న రెవెన్యూ అధికారులు


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు బాలమణి

చేగుంట(తూప్రాన్): డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించడం లేదని కొంతమంది గృహప్రవేశ యత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. బుధవారం మండల కేంద్రమైన చేగుంటలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయడం లేదని సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులు వాటిని ఆక్రమించే యత్నం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకుని ఇళ్లను ఆక్రమించకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు బాలమణి మాట్లాడారు. 2018లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని, పేదలు మూడు పర్యాయాలు దరఖాస్తు చేసుకున్నా ఎందుకు కేటాంచలేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. అంతే కాకుండా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించలేదనే ప్రచారం జరుగుతున్నందున ఇళ్లు లేని పేదలతో డబుల్ బెడ్‌రూం లోకి వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణాలు పూర్తవుతాయని అర్హులకే కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఇళ్లలేని నిరుపేద మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై కుట్రలకు నిదర్శనం

గజ్వేల్: ఉపాధి హామీ పథకంపై కేంద్రం అనుసరిస్తున్న కుట్రలకు ఆ పథకానికి తాజా బడ్జెట్‌లో కేటాయింపులే నిదర్శనమని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మండిపడ్డారు. బుధవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని కూలీలకు పనులు కల్పించేందుకు రూ.3లక్షల కోట్లు అవసరముండగా అందులో కోత విధించి పథకం ఎత్తివేయాలనే కుట్రలను స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. గత బడ్జెట్‌లో అరకొరగా రూ.60వేల కోట్లు కేటాయిస్తే నేడు మరింతగా దారుణంగా కేవలం రూ.35వేల కోట్లను మాత్రమే కేటాయించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదల హక్కులను కాలరాస్తున్న కేంద్రం తీరుపై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. బుధవారం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం తాగి వాహనాలు నడుపుతూ సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో 12 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి 11 మందికి ఒక్కక్కరికి రూ.2 వేలు, మరో వ్యక్తికి రూ.3 వేల చొప్పున జరిమాన విధించినట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు బుధవారం జరిమానా విధించింది. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో తొమ్మిది మంది నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన జడ్జి రమేశ్‌బాబు రూ.20,500 జరిమానా విధించారు.

కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటఅర్బన్: కక్షతో తమను కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. బుధవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన ఆలేటి కనకయ్య, ఆలేటి శివన్, ఆలేటి నాగరాజు రజక సంఘంలో సభ్యులుగా కొనసాగుతున్నారు. కాగా తమపై కొంత మంది కక్ష గట్టి సంఘం నుంచి వెలివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా కుల సంఘానికి సంబంధించిన చిట్టి లెక్కలు తమకు చూపడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా ఏ శుభకార్యం జరిగినా తమను రానివ్వకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎక్కడ ఫిర్యాదు చేసినా, ఎవరికి చెప్పినా తమను కులంలోకి రానివ్వమని కొంతమంది బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు.

రెవెన్యూ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు తొంట మల్లయ్య కుటుంబ సభ్యులు

తూప్రాన్: తాను బతికుండగానే మరణించినట్లుగా ధృవీకరించి విలువైన భూమిని మరొకరి పేరుమీదు పట్టా చేసిన రెవెన్యూ అధికారులపై బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంకటాయిపల్లి గ్రామస్తుడు తొంట మల్లయ్య బతికి ఉండగానే మరణించినట్లుగా ధ్రువీకరించి, అతడి భూమిని అధికారులు ఇతరులకు పట్టా చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. మల్లయ్య కొన్నాళ్లుగా బతుకు దెరువు కోసం నర్సింగ్ మండలంలోని సంకాపూర్‌లో కూలీ పనులు చేస్తున్నాడు. అతడికి వెంకటాయిపల్లిలో సర్వే నంబరు 135/4లో 0.550 గుంటలు, సర్వే నంబరు 177/ఇ/1లో 0.700 గుంటల లావాణి పట్టా భూములు ఉన్నాయి. మల్లయ్య గ్రామంలో లేకపోవడంతో ఇదే అదనుగా భావించిన వరుసకు అన్న తొంట యాదయ్య రెవెన్యూ అధికారులతో చేతులు కలిపాడు. మల్లయ్య మృతి చెందినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి మరొకరికి పట్టా చేశారు. ఇందుకు కారకులైన రెవెన్యూ అధికారులు, తొంట యాదయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు, ఆర్డీఓకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బావను చంపిన బావమరిది

అప్పు చెల్లించకపోవడంతో గొడవ


హత్యకు గురైన అబ్దుల్ అన్వర్

కేపీహెచ్‌బీకాలనీ: మద్యం మత్తులో సొంత బావను దారుణంగా హత్య చేసిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేదనే కారణంతోనే అంతమొందించినట్లు భావిస్తున్నారు. కేపీహెచ్‌బీ సీఐ కిషన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం మన్యర్‌వాడికి చెందిన అబ్దుల్ అన్వర్ (27)కు 2019లో నగరంలోని మియాపూర్, హఫీజ్‌పేట్‌కి చెందిన ఫరీన్ బేగంతో వివాహం జరిగింది. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న అబ్దుల్ అన్వర్, అతడి బావమరిది సయ్యద్ అహ్మద్ స్నేహితుడైన మహమ్మద్ అకీల్ వద్ద ఆటో అద్దెకు తీసుకొని నడుపుతున్నాడు. కొద్ది రోజుల తరువాత అకీల్ నుంచి అన్వర్ కొంత అప్పు తీసుకున్నాడు. ఆటో అద్దె, తీసుకున్న అప్పు వడ్డీతో కలిపి రూ.1.45 లక్షలైంది. డబ్బులు తిరిగి చెల్లించాలంటూ అన్వర్‌ను తరచూ అకీల్‌ను అడుగుతున్నా చెల్లించడం లేదు. దాంతో అకీల్ అన్వర్ బావమరిదిపై ఒత్తిడి తెచ్చాడు. జనవరి 30వ తేదీన అన్వర్ బావమరిది సయ్యద్ అహ్మద్ కోహిర్ వెళ్లి ఒకరోజు అక్కడే ఉండి 31వ తేదీన అన్వర్‌ను తీసుకొని హైదరాబాద్ వచ్చాడు. అదే రోజు రాత్రి 8 గంటల నుంచి మద్యం తాగుతూ డబ్బు విషయంలో గొడవపడ్డారు. గొడవపెరగడంతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ సమీపంలో ముళ్లకత్వ చెరువు గట్టుపై అన్వర్‌ను అంతమొందించారు. బుధవారం మృతుడి సోదరుడు అబ్దుల్ సమద్‌కి అన్వర్ స్నేహితుడు ఫోన్‌చేశాడు. బావమరిది సయ్యద్ అహ్మద్ అతడి స్నేహితులు కేపీహెచ్‌బీ కాలనీ ముళ్లకత్వ చెరువు వద్ద హత్య చేశారని తెలిపాడు. ముళ్ళకత్వ చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు, సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు సమద్ తన సోదరుడిని అతడిఅత్త, బావమరిది, స్నేహితులు హత్య చేశారని పేర్కొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

మియాపూర్ : గుర్తుతెలియని మహిళ మృతదేహం చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లభ్యమైంది. లింగంపల్లిలోని నల్లగండ్ల ఫ్లైఓవర్ కింద గుర్తుతెలియని మహిళ(60) పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ మహిళ మృతి చెంది ఉంది. చుట్టుపక్కల ఆమె గురించి విచారించగా, యాచకురాలని స్థానికులు చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి..ఒకరి మృతి

మియాపూర్: ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన సారంగతమిశ్ర(50) భార్య మీనతీమిశ్రా, కుమారుడుతో కలిసి చందానగర్‌లోని నివాసముంటున్నాడు. సారంగతమిశ్రా మీర్‌పేట్‌లో జిరాక్స్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో సారంగత మిశ్రా తన బైక్‌పై పనిముగించుకుని ఇంటికి వస్తుండగా మదీనాగూడలోని జాతీయ రహదారి వద్ద చందానగర్ వైపు వెళుతుండగా, అదుపు తప్పింది. దీంతో డివైడర్‌పై పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే దగ్గరలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.